03-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - జ్ఞాన-యోగాల శక్తితో వాయుమండలాన్ని శుద్ధముగా తయారుచేయాలి, స్వదర్శన చక్రముతో మాయపై విజయాన్ని పొందాలి"

ప్రశ్న:- ఆత్మ ఎప్పటికీ జ్యోతిలో లీనమవ్వదు అని ఏ ఒక్క విషయం ద్వారా నిరూపించబడుతుంది?

జవాబు:- ఈ సృష్టి నాటకము తయారై సిద్ధముగా ఉన్నది, అదే ఇప్పుడు జరుగుతుంది... అని అంటూ ఉంటారు, కావున తప్పకుండా ఆత్మ తన పాత్రను రిపీట్ చేస్తుంది. ఒకవేళ జ్యోతి జ్యోతిలో లీనమైతే ఇక పాత్ర సమాప్తమైపోయినట్లు, అప్పుడిక అనాది డ్రామా అని అనడం కూడా తప్పు అవుతుంది. ఆత్మ ఒక పాత వస్త్రాన్ని వదిలి ఇంకొక కొత్త వస్త్రాన్ని ధరిస్తుంది, అంతేకానీ లీనమవ్వదు.

పాట:- ఓ దూరదేశపు యాత్రికుడా... (ఓ దూర్ కే ముసాఫిర్...)

ఓం శాంతి. ఇప్పుడు యోగీ మరియు జ్ఞానీ పిల్లలెవరైతే ఉన్నారో, ఎవరైతే ఇతరులకు అర్థం చేయించగలరో, వారు ఈ పాట అర్థాన్ని యథార్థ రీతిలో అర్థం చేసుకోగలరు. మనుష్యమాత్రులెవరైతే ఉన్నారో వారంతా స్మశానగ్రస్థులుగా ఉన్నారు. ఎవరి జ్యోతి అయితే ఆరిపోయి ఉందో, ఎవరైతే తమోప్రధానంగా ఉన్నారో వారినే స్మశానగ్రస్థులు అని అంటారు. ఎవరైతే స్థాపన చేసారో మరియు ఎవరైతే జన్మజన్మాంతరాలు పాలన కొరకు నిమిత్తంగా అయ్యారో వారంతా తమ జన్మలను పూర్తి చేసుకున్నారు. ఆది నుండి మొదలుకుని అంతిమం వరకూ ఏయే ధర్మాల స్థాపన జరిగింది అనేది లెక్క తీయవచ్చు. హద్దు నాటకాలలో కూడా ముఖ్యమైన డ్రామా రచయిత, డైరెక్టర్, పాత్రధారులు ఎవరైతే ఉంటారో వారికే గౌరవము ఉంటుంది. ఎన్ని ప్రైజులు లభిస్తాయి. వారు తమ సత్తాను చూపిస్తారు కదా. అలాగే మీది జ్ఞాన-యోగాల సత్తా. మృత్యువు ఎదురుగా ఉందని మనుష్యులకు తెలియదు. తాము ఈ డ్రామాలో ఎన్ని జన్మలు తీసుకుంటారు, ఎక్కడి నుండి వస్తారు అనేది వారికి తెలియదు. అన్ని జన్మల గురించి విస్తారంగానైతే నేను, మీరు తెలుసుకోలేము. ఇకపోతే ఈ సమయంలో భవిష్యత్తు కొరకు మన పురుషార్థం నడుస్తుంది. దేవతలుగా అయితే అవుతారు కానీ ఏ పదవిని పొందుతారు, దాని కోసం పురుషార్థము చేయాలి. ఈ లక్ష్మీ-నారాయణులు 84 జన్మలు తీసుకున్నారని మీకు తెలుసు. ఇప్పుడు వీరు తప్పకుండా రాజా-రాణులుగా అవుతారు, వీరి ముఖకవళికలు గురించి కూడా తెలుసు. ప్రత్యక్షంగా సాక్షాత్కారము చేయిస్తారు. భక్తి మార్గములో కూడా సాక్షాత్కారాలు జరుగుతాయి. అక్కడ వారు ఎవరిని ధ్యానం చేస్తే వారి సాక్షాత్కారం జరుగుతుంది. శ్రీకృష్ణుని చిత్రాన్ని నల్లగా చూసారు, వారిని ధ్యానము చేసినట్లయితే అటువంటి సాక్షాత్కారము జరుగుతుంది. ఇకపోతే శ్రీకృష్ణుడు ఆ విధంగా నల్లగా ఉండరు. మనుష్యులకు ఈ విషయాల గురించి ఏమాత్రం జ్ఞానము ఉండదు. ఇప్పుడు మీరు ప్రత్యక్షంగా ఇక్కడ ఉన్నారు. సూక్ష్మవతనంలో కూడా చూస్తారు, వైకుంఠంలో కూడా చూస్తారు. ఆత్మ మరియు పరమాత్మల జ్ఞానము ఉంది. ఆత్మ సాక్షాత్కారమే జరుగుతుంది. ఇక్కడ మీరు ఏ సాక్షాత్కారమునైతే పొందుతారో దాని జ్ఞానము మీ వద్ద ఉంది. బయటివారికి ఆత్మ సాక్షాత్కారము జరిగినా కానీ జ్ఞానమైతే లేదు. వారైతే ఆత్మయే పరమాత్మ అని అనేస్తారు. ఆత్మ తప్పకుండా నక్షత్రము వలె ఉంటుంది. అలా ఎందరో కనిపిస్తారు. ఎంతమంది మనుష్యులు ఉన్నారో అన్ని ఆత్మలు ఉన్నాయి. మనుష్యుల శరీరాలు ఈ కళ్ళకు కనిపిస్తాయి. ఆత్మను దివ్యదృష్టి ద్వారా చూడగలుగుతారు. మనుష్యుల రంగులు, రూపాలు రకరకాలుగా ఉంటాయి, ఆత్మలు రకరకాలుగా ఉండవు, అన్నీ ఒకే రకంగా ఉంటాయి. కేవలం ప్రతి ఆత్మ యొక్క పాత్ర వేర్వేరుగా ఉంటుంది. మనుష్యులు ఏ విధంగా చిన్నగా, పెద్దగా ఉంటారో, అలా ఆత్మలు చిన్నగా, పెద్దగా ఉండవు. ఆత్మల సైజు ఒకేలా ఉంటుంది. ఒకవేళ ఆత్మ జ్యోతిలో లీనమైపోతే ఇక పాత్రను ఎలా రిపీట్ చేస్తుంది? ఈ సృష్టి నాటకము తయారై సిద్ధముగా ఉన్నది, అదే ఇప్పుడు జరుగుతుంది... అని అంటూ ఉంటారు. ఈ అనాది ప్రపంచ డ్రామా తిరుగుతూ ఉంటుంది. ఇది పిల్లలైన మీకు తెలుసు. దోమల గుంపులా ఆత్మలు తిరిగి వెళ్తాయి. దోమలనైతే ఈ కళ్ళతో చూడవచ్చు. ఆత్మను దివ్యదృష్టి లేకుండా చూడలేరు. సత్యయుగంలో ఆత్మ సాక్షాత్కారము యొక్క అవసరం ఉండదు. ఆత్మ అయిన నేను ఒక పాత శరీరాన్ని వదిలి మరొక కొత్త శరీరాన్ని తీసుకోవాలి అని వారు భావిస్తారు. అక్కడ పరమాత్ముని గురించైతే తెలియనే తెలియదు. ఒకవేళ పరమాత్ముని గురించి తెలిస్తే సృష్టి చక్రము గురించి కూడా తెలిసి ఉండాలి.

పాటలో - మమ్మల్ని కూడా మీతో పాటు తీసుకువెళ్ళండి అని అంటారు. చివరి సమయంలో ఎంతగానో

పశ్చాత్తాపపడతారు. అందరికీ ఆహ్వానము లభిస్తుంది. ఆహ్వానాన్ని ఇచ్చేందుకు ఎన్ని యుక్తులు తయారవుతున్నాయి.

శాంతి, శాంతి అని అందరూ అంటారు కానీ శాంతి అర్థము గురించి ఎవరూ అర్థం చేసుకోరు. శాంతి ఎలా ఏర్పడుతుంది అనేది మీకు తెలుసు. ఏ విధంగా గానుగలో ఆవగింజలు నలిగిపోతాయో అలాగే అందరి శరీరాలు వినాశనములో అంతమైపోతాయి. ఆత్మలు అలా నలగవు. అవి వెళ్ళిపోతాయి. ఆత్మలు దోమల గుంపులా పరుగెడతాయి అని వ్రాయబడి కూడా ఉంది. పరమాత్మలందరూ పరుగెడతారు అని అనరు. మనుష్యులు ఏమీ అర్థం చేసుకోరు. ఆత్మ మరియు పరమాత్మకు ఏమి వ్యత్యాసము ఉంది, ఇది కూడా తెలియదు. మనమంతా సోదరులము అని అంటారు, మరి సోదరులుగా ఉండాలి. సత్యయుగములో సోదరులు లేక సోదరీ-సోదరులందరూ పరస్పరం పాలు, పంచదారలా కలిసిమెలిసి నడుచుకుంటారని వారికి తెలియదు. అక్కడ ఉప్పు నీరులా అయ్యే విషయమే ఉండదు. ఇక్కడ చూడండి, ఇప్పుడిప్పుడే పాలు, పంచదారలా కలిసి ఉంటారు, మళ్ళీ ఇప్పుడిప్పుడే ఉప్పు నీరులా అయిపోతారు. ఒకవైపు చైనీయులు, హిందువులు భాయి-భాయి అని అంటారు, మళ్ళీ ఇంకొకవైపు వారి దిష్టిబొమ్మను తయారుచేసి కాలుస్తూ ఉంటారు. దైహిక సోదరుల పరిస్థితి ఎలా ఉందో చూడండి. ఆత్మిక సంబంధము గురించైతే తెలియదు. స్వయాన్ని ఆత్మగా భావించాలి అని మీకు తండ్రి అర్థం చేయిస్తారు. దేహాభిమానంలో చిక్కుకోకూడదు. కొందరు దేహాభిమానంలో చిక్కుకుంటారు. తండ్రి అంటారు, దేహ సహితంగా, దేహ సంబంధాలు ఏవైతే ఉన్నాయో వాటన్నింటినీ వదలాలి. ఈ ఇళ్ళు మొదలైనవాటన్నింటినీ మర్చిపోండి. వాస్తవానికి మీరు పరంధామ నివాసులు. ఇప్పుడిక ఎక్కడి నుండైతే పాత్రను అభినయించేందుకు వచ్చారో అక్కడికి మళ్ళీ వెళ్ళాలి. ఆ తర్వాత నేను మిమ్మల్ని సుఖములోకి పంపిస్తాను. కావున తండ్రి అంటారు, యోగ్యులుగా అవ్వాలి. భగవంతుడు రాజ్య స్థాపనను చేస్తున్నారు. క్రైస్టుకు రాజ్యమేమీ ఉండేది కాదు. ఎప్పుడైతే లక్షలాది మంది క్రిస్టియన్లు తయారవుతారో, అప్పుడు వారి రాజ్యం తయారై ఉంటుంది. ఇక్కడైతే వెంటనే సత్యయుగ రాజ్యం తయారైపోతుంది. ఇది ఎంత సహజమైన విషయము. తప్పకుండా భగవంతుడు వచ్చి స్థాపన చేసారు. శ్రీకృష్ణుని పేరు వేయడంతో అంతా గడబిడ చేసేసారు. గీతలో ప్రాచీన రాజయోగము మరియు జ్ఞానము ఉన్నాయి. అది కనుమరుగైపోతుంది. ఇంగ్లీష్ పదాలు బాగున్నాయి. బాబాకు ఇంగ్లీషు తెలియదు అని మీరంటారు. బాబా అంటారు, నేను ఎంతవరకని అన్ని భాషలను కూర్చొని మాట్లాడుతాను? ముఖ్యమైనది హిందీ. కావున నేను హిందీలోనే మురళిని వినిపిస్తాను. ఎవరి శరీరమునైతే ధారణ చేసానో, వారికి కూడా హిందీయే తెలుసు. కావున వారి భాష ఏదైతే ఉందో, దానినే నేను కూడా మాట్లాడుతాను. వేరే ఏ భాషలోనైనా చదివిస్తానా. నేను ఫ్రెంచ్ మాట్లాడితే ఇతనెలా అర్థం చేసుకుంటారు? ముఖ్యమైనది ఇతని (బ్రహ్మ) విషయము. మొదట ఇతను అర్థం చేసుకోవాలి కదా. వేరే ఎవరి శరీరాన్ని అయినా తీసుకుంటానా.

పాటలో కూడా నన్ను తీసుకువెళ్ళండి అని అంటారు ఎందుకంటే తండ్రి మరియు తండ్రి ఇంటి గురించి ఎవ్వరికీ తెలియదు. కేవలం గొప్పలు చెప్తూ ఉంటారు. అనేకమంది మనుష్యులవి అనేక మతాలు, అందుకే దారము చిక్కుపడిపోయి ఉంది. తండ్రి ఎలా కూర్చొని ఉన్నారో చూడండి. ఈ చరణాలు ఎవరివి? (శివబాబావి). ఇవి నావి కదా! నేను అద్దెకు ఇచ్చాను, శివబాబా అయితే తాత్కాలికంగా ఉపయోగిస్తారు. నిజానికి ఈ చరణాలైతే నావి కదా. శివుని మందిరములో చరణాలను ఉంచరు. చరణాలు శ్రీకృష్ణునివి ఉంచుతారు. శివుడైతే ఉన్నతోన్నతమైనవారు, మరి వారికి చరణాలు ఎక్కడి నుండి వచ్చాయి. అయితే, శివబాబా అద్దెకు తీసుకున్నారు, చరణాలైతే బ్రహ్మవే. మందిరాలలో ఎద్దును చూపించారు. ఎద్దుపై స్వారీ ఎలా జరుగుతుంది? ఎద్దుపై శివబాబా ఎలా ఎక్కుతారు? సాలిగ్రామమైన ఆత్మ మనుష్య తనువుపై స్వారీ చేస్తుంది. తండ్రి అంటారు, నేను మీకు ఏ జ్ఞానాన్ని అయితే వినిపించానో, అది కనుమరుగైపోయింది. పిండిలో ఉప్పు అంత మిగిలి ఉంది. దానిని ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. నేనే వచ్చి దాని సారాన్ని అర్థం చేయిస్తాను. నేనే శ్రీమతాన్ని ఇచ్చి సృష్టిచక్రపు రహస్యాన్ని అర్థం చేయించాను, వారేమో దేవతలకు స్వదర్శన చక్రాన్ని చూపించారు. వారి వద్ద అయితే జ్ఞానము లేదు. ఇదంతా జ్ఞానము యొక్క విషయము. ఆత్మకు సృష్టిచక్రపు జ్ఞానము లభిస్తుంది, దాని ద్వారా మాయ శిరస్సును ఖండించడం జరుగుతుంది. దానికి బదులుగా వారు స్వదర్శన చక్రాన్ని అసురులపై ప్రయోగించినట్లుగా చూపించారు. ఈ స్వదర్శన చక్రముతో మీరు మాయపై విజయాన్ని పొందుతారు. ఎక్కడి విషయాన్ని ఎక్కడికి తీసుకువెళ్ళారు. మీలో కూడా ఏ ఒక్కరో ఈ విషయాలను ధారణ చేసి అర్థం చేయించగలరు. జ్ఞానము ఉన్నతమైనది. ఇందులో సమయం పడుతుంది. చివరిలో మీలో జ్ఞాన, యోగాల శక్తి ఉంటుంది. ఇది డ్రామాలో నిశ్చితమై ఉంది. వారి బుద్ధి కూడా మెత్తబడుతూ ఉంటుంది. మీరు వాయుమండలాన్ని శుద్ధం చేస్తారు. ఇది ఎంత గుప్తమైన జ్ఞానము. అజామిళుని వంటి పాపులను ఉద్ధరించారు అని వ్రాయబడి ఉంది కానీ

దాని అర్థాన్ని కూడా అర్థం చేసుకోరు. వారు - జ్యోతి జ్యోతిలో కలిసిపోయిందని, సాగరములో లీనమైపోయిందని, పంచ పాండవులు హిమాలయాలలో కరిగిపోయారని, ప్రళయం జరిగిపోయిందని భావిస్తారు. ఒకవైపు వారు రాజయోగాన్ని నేర్చుకున్నట్లుగా చూపిస్తారు, మళ్ళీ ప్రళయం చూపించారు, ఆ తర్వాత శ్రీకృష్ణుడు నోటిలో బొటనవేలు చప్పరిస్తూ రావి ఆకుపై వచ్చినట్లుగా చూపిస్తారు. దాని అర్థాన్ని కూడా అర్థం చేసుకోరు. అతను గర్భమహలులో ఉండేవారు. బొటనువేలునైతే చిన్నపిల్లలు చప్పరిస్తారు. ఎక్కడి విషయాన్ని ఎక్కడ చూపించారు. మనుష్యులు ఏది వింటే దానినే సత్యము, సత్యము అని అంటూ ఉంటారు.

సత్యయుగము గురించి ఎవరికీ తెలియదు. ఏదైతే అసలు ఉండనే ఉండదో దానిని అసత్యము అని అంటారు. పరమాత్మునికి నామ-రూపాలే లేవు అని అంటారు. కానీ వారిని పూజిస్తూ ఉంటారు. పరమాత్మ అతి సూక్ష్మమైనవారు. వారి వంటి సూక్ష్మమైన వస్తువు ఇంకేదీ లేదు. పూర్తిగా ఒక బిందువులా ఉంటారు. సూక్ష్మముగా ఉన్న కారణంగానే వారి గురించి ఎవరికీ తెలియదు. ఆకాశాన్ని కూడా సూక్ష్మము అని అంటారు కానీ అదంతా అంతరిక్ష స్థలము. పంచ తత్వాలు ఉన్నాయి. వారు పంచతత్వాల శరీరంలోకి వచ్చి ప్రవేశిస్తారు. వారు ఎంత సూక్ష్మమైనవారు. పూర్తిగా ఒక బిందువులా ఉంటారు. నక్షత్రం ఎంత చిన్నదిగా ఉంటుంది. ఇక్కడ నక్షత్రము వంటి పరమాత్మ పక్కనే వచ్చి కూర్చున్నప్పుడే మాట్లాడగలరు. ఇవి ఎంత సూక్ష్మమైన విషయాలు. మందబుద్ధి కలవారైతే కొద్దిగా కూడా అర్థం చేసుకోలేరు. తండ్రి ఎంత మంచి-మంచి విషయాలను అర్థం చేయిస్తారు. డ్రామానుసారంగా కల్పపూర్వం ఏ పాత్రనైతే అభినయించారో దానినే మళ్ళీ అభినయిస్తారు. బాబా రోజు వచ్చి కొత్త-కొత్త విషయాలను వినిపిస్తారని పిల్లలు అర్థం చేసుకుంటారు, కావున ఇది కొత్త జ్ఞానము కదా. అందుకే దీనిని రోజు చదవాలి. ఎవరైనా రోజు రాకపోతే తమ స్నేహితుని వద్దకు వెళ్ళి - ఈ రోజు క్లాసులో ఏం జరిగింది అని అడుగుతారు. ఇక్కడైతే కొందరు చదవడమే వదిలేస్తారు. మాకు ఇక అవినాశీ జ్ఞాన రత్నాల వారసత్వమే వద్దు అని అనేస్తారు. అరే, చదవడం వదిలేస్తే మీ పరిస్థితి ఏమవుతుంది? తండ్రి నుండి వారసత్వాన్ని ఏం తీసుకుంటారు? అంతే, భాగ్యములో లేదు. ఇక్కడ స్థూలమైన ఆస్తి యొక్క విషయం లేదు, జ్ఞాన ఖజానా తండ్రి నుండి లభిస్తుంది. ఆ ఆస్తి మొదలైనవన్నీ అయితే వినాశనమవ్వనున్నాయి, వాటి విషయములో ఎవరూ నషాను ఉంచుకోలేరు. తండ్రి నుండే వారసత్వం లభించనున్నది. మీ వద్ద కోట్ల ఆస్తి ఉన్నా సరే, అది కూడా మట్టిలో కలిసిపోనున్నది. ఇదంతా ఈ సమయానికి సంబంధించిన విషయమే. కొందరిది ధూళిలో కలిసిపోతుంది, కొందరిది అగ్ని కాల్చివేస్తుంది... అని కూడా వ్రాయబడి ఉంది. ఈ సమయంలోని విషయాలు చివరివరకూ కొనసాగుతాయి. వినాశనమైతే ఇప్పుడు జరగనున్నది. వినాశనం తర్వాత మళ్ళీ స్థాపన. ఇప్పుడు వారు స్థాపన చేస్తున్నారు. అది మన రాజధాని. మీరు ఇతరుల కొరకు చేయడం లేదు, ఏది చేస్తున్నా అది మీ కొరకే చేసుకుంటున్నారు. ఎవరైతే శ్రీమతంపై నడుస్తారో వారు యజమానులుగా అవుతారు. మీరైతే కొత్త విశ్వంలో కొత్త భారత్ కు యజమానులుగా అవుతారు. కొత్త విశ్వములో అనగా సత్యయుగములో మీరు యజమానులుగా ఉండేవారు. ఇప్పుడు ఇది పాత యుగము, మళ్ళీ మీ చేత కొత్త ప్రపంచం కొరకు పురుషార్థం చేయించడం జరుగుతుంది. ఇవి అర్థం చేసుకోవాల్సిన ఎంత మంచి-మంచి విషయాలు. ఆత్మ మరియు పరమాత్మల జ్ఞానము, సెల్ఫ్ రియలైజేషన్. సెల్ఫ్ అనగా స్వయానికి తండ్రి ఎవరు? తండ్రి అంటారు, ఆత్మలైన మీకు నేర్పించేందుకు నేను వస్తాను. ఇప్పుడు తండ్రిని తండ్రి ద్వారా అర్థం చేసుకున్నారు. మీరు నా చాలా కాలం దూరమై తర్వాత కలిసిన పిల్లలు అని తండ్రి అర్థం చేయిస్తారు. వారసత్వాన్ని తీసుకునేందుకు కల్పం తర్వాత మళ్ళీ వచ్చి కలుసుకున్నారు. కావున పురుషార్థం చేయాలి కదా. లేదంటే చాలా పశ్చాత్తాప పడాల్సి వస్తుంది, చాలా శిక్షలు అనుభవించాల్సి వస్తుంది. ఎవరైతే పిల్లలుగా అయి మళ్ళీ చెడు కర్మలు చేస్తారో, వారి గురించి ఇక అడగకండి. డ్రామాలో బాబా పాత్ర ఎంతగా ఉందో చూడండి. అంతా ఇచ్చేసారు. మళ్ళీ భవిష్య 21 జన్మల కొరకు ప్రతిఫలాన్ని ఇస్తాను అని బాబా అంటారు. ఇంతకుముందు మీరు ఇన్ డైరెక్టుగా ఇచ్చేవారు కావున భవిష్య ఒక్క జన్మ కొరకు ఇచ్చేవాడిని. ఇప్పుడు డైరెక్టుగా ఇస్తున్నారు కావున భవిష్య 21 జన్మల కొరకు ఇన్స్యూర్ చేస్తాను. డైరెక్ట్ మరియు ఇన్ డైరెక్ట్ లో ఎంత తేడా ఉంది. వారు ద్వాపర, కలియుగాల కొరకు ఈశ్వరుని వద్ద ఇన్స్యూర్ చేసుకుంటారు. మీరు సత్య, త్రేతా యుగాల కొరకు ఇన్స్యూర్ చేసుకుంటారు. డైరెక్టుగా చేసుకుంటున్న కారణంగా 21 జన్మల కొరకు లభిస్తుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు నంబరువారు పురుషార్థానుసారంగా మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. అవినాశీ తండ్రి నుండి అవినాశీ జ్ఞాన రత్నాల ఖజానాను తీసుకుని భాగ్యవంతులుగా అవ్వాలి. కొత్త జ్ఞానాన్ని, కొత్త చదువును రోజూ చదవాలి. వాయుమండలాన్ని శుద్ధముగా చేసే సేవను చేయాలి.

2. భవిష్య 21 జన్మల కొరకు మీ సర్వస్వాన్ని ఇన్స్యూర్ చేసుకోవాలి. తండ్రికి చెందినవారిగా అయిన తర్వాత ఎటువంటి చెడు కర్మలు చేయకూడదు.

వరదానము:- స్వ ఉన్నతి అనే యథార్థమైన కళ్ళజోడును ధరించి ఉదాహరణగా అయ్యే నిర్లక్ష్యము నుండి ముక్త భవ
ఏ పిల్లలైతే స్వయాన్ని కేవలం చాలా తెలివైనవారము అనే దృష్టితో చెక్ చేసుకుంటారో, వారి కళ్ళజోడు నిర్లక్ష్యముతో కూడినదిగా ఉంటుంది. నేను ఎంతైతే చేసానో అది చాలానే చేసాను అన్నట్లే వారికి కనిపిస్తుంది. నేను ఈ-ఈ ఆత్మల కన్నా మంచిగా ఉన్నాను, ఎంతో కొంత లోపాలైతే ప్రసిద్ధులైనవారిలో కూడా ఉన్నాయి అని వారు భావిస్తారు. కానీ ఎవరైతే సత్యమైన హృదయంతో స్వయాన్ని చెక్ చేసుకుంటారో వారి కళ్ళజోడు యథార్థమైన స్వ ఉన్నతికి సంబంధించి ఉన్న కారణంగా వారు కేవలం తండ్రిని మరియు స్వయాన్నే చూస్తారు. రెండవవారు, మూడవవారు ఏం చేస్తున్నారు అన్నది చూడరు. నేను మారాలి అన్న ఈ ధ్యాసలోనే ఉంటారు, వారు ఇతరుల కొరకు ఉదాహరణగా అవుతారు.

స్లోగన్:- హద్దులను సర్వ వంశ సహితంగా సమాప్తం చేసినట్లయితే అనంతమైన రాజ్యాధికారపు నషా ఉంటుంది.